'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

జిల్లా విద్యాధికారి విజయకుమారి

గణిత ఉపాధ్యాయుల శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డీఈవో విజయకుమారి

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 2 : ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని మేడ్చల్ జిల్లా విద్యాధికారి విజయకుమారి అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి పీఎన్ఎం పాఠశాల వివేకానంద సేవా సమితి ఆడిటోరియంలో ప్రభుత్వ పాఠశాలల గణిత ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ.. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో గణితం బోధించే ఉపాధ్యాయులు విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి గణితం పట్ల ఆసక్తిని పెంచేలా కృషి చేయాలని కోరారు. ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగితే వందశాతం ఉత్తీర్ణత సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు గణితం స్టేట్ రిసోర్స్ పర్సన్, పాఠ్యపుస్తక రచయిత పడాల సురేశ్‌కుమార్, తెలుగు స్టేట్ రిసోర్స్ పర్సన్ భానుప్రకాశ్ ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ క్లాస్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగం సెక్రటరీ సురేశ్, ఎంఈవో ఆంజనేయులు, ఏఎంవో రవీందర్ రాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

జేఎన్‌టీయూహెచ్ సదస్సులో వీసీ కట్టా నర్సింహారెడ్డి, ఇన్‌చార్జి రెక్టార్ వెంకటేశ్వర్‌రావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సునీతారెడ్డి తదితరులు

ఫార్మా రంగంలో ఉజ్వల భవిష్యత్

వీసీ కట్టా నర్సింహారెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 2 : ఫార్మా రంగంతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ఫార్మా రంగంలో నిరంతర పరిశోధనలు జరగాలని జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూహెచ్ జేఎన్ ఆడిటోరియంలో సొసైటీ ఆఫ్ ఫార్మా ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ సంస్థ, సుల్తాన్‌పూర్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సునీతారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సును వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి, డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ రామకృష్ణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫార్మా రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, మెడికల్, హెల్త్ విషయాల్లో కొత్త పరిశోధనలో రకరకాల మందుల ఉత్పత్తి జరుగుతుందని, ఇంకా అనేక పరిశోధనలు సాగుతున్నాయని, నూతన ఆవిష్కరణలకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు చెందిన 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ ఎన్ ల్యాబ్ కిరణ్‌కుమార్, అరబిందో ల్యాబ్ సుపర్ణదాస్, న్యూయార్క్‌కు చెందిన దినేష్ జైశ్వాల్ పరిశోధనా అంశాలను వివరించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే విద్యార్థి దశ నుంచే చిన్నారులు అన్ని రంగాల్లో రాణించాలని రిటైర్డ్ డీఐజీ సుధాకర్ అన్నారు. కొండాపూర్‌లోని న్యూబ్లూమ్స్ పాఠశాలలో గణతంత్ర దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కానీ మారుతి సాగర్‌తో కలిసి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. *- కొండాపూర్, ఫిబ్రవరి 2*

మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం ప్రముఖ చిత్రకారుడు ఆనంద్‌శాస్త్రి వేసిన పెయింటింగ్స్‌తో ఏర్పాటు చేసిన 'అబోడ్స్ ఆఫ్ అడ్మిరేషన్' చిత్ర ప్రదర్శనను ఆర్కిటెక్ట్ రామమూర్తి ప్రారంభించారు. అనంతరం అలేఖ్య హోం ఎండీ శ్రీనాథ్ కుర, ఆర్టిస్ట్ అంజు పొద్దర్‌లతో కలిసి చిత్రాలను తిలకించారు. – కొండాపూర్

శ్రీనివాసనగర్ కమ్యూనిటీ హాల్ కబ్జాపై ఫిర్యాదు

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 2 : జగద్గిరిగుట్ట డివిజన్ శ్రీనివాసనగర్ కమ్యూనిటీహాల్‌ను కబ్జాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. శుక్రవారం గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. సంక్షేమ సంఘం ముసుగులో కొందరు బయటి వ్యక్తికి అద్దెకు ఇచ్చి ఆపై ఆక్రమణకు పాల్పడ్డారని తెలిపారు. ప్రభుత్వానికి చెందిన స్థలం, అందులోని రూమ్ బస్తీవాసులకు ఉపయోగించుకునే పరిస్థితి లేదు. ఈ విషయమై ఏడాదిగా వివాదం కొనసాగుతున్నది. అప్పట్లో ఖాళీ చేస్తామని చెప్పి అద్దెకు ఇచ్చిన వారు తర్వాత పట్టించుకోకపోవడంతో రెండురోజుల కిందట స్థానికులు ఆందోళన చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికనేతలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

దుర్గంచెరువులో ఫ్లడ్ రెస్క్యూ శిక్షణ

కొండాపూర్, ఫిబ్రవరి 2 : వరదలు వచ్చినప్పుడు రెస్క్యూ ఆపరేషన్ చేసే విధానాలపై శుక్రవారం మాదాపూర్‌లోని దుర్గంచెరువులో తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ అధికారులు, ఇండియన్ రెస్క్యూ అకాడమీతో కలిసి ప్రత్యేక శిక్షణను అందించారు. 73 మంది ట్రైనీలకు రెస్క్యూ డ్రిల్, బోట్ డ్రిల్స్‌పై ప్రత్యేకంగా శిక్షణను అందించారు. 16 రోజులపాటు శిక్షణ కొనసాగుతుందని తెలంగాణ ఫైర్ సర్వీస్‌మెంట్ పీఆర్ఓ వీ ధనుంజయరెడ్డి తెలిపారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పనుల్లో జాప్యాన్ని సహించను

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

అభివృద్ధి పనులపై క్యాంపు కార్యాలయంలో అధికారులు, కార్పొరేటర్లతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, ఫిబ్రవరి 2 : సమస్యల పరిష్కారంతోపాటు అభివృద్ధి పనుల అమలులో జాప్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోనని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. ఇప్పటికే శంకుస్థాపన పూర్తి చేసుకున్న పనులన్నింటినీ పూర్తి చేయాల్సిందేనన్నారు. నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనుల పురోగతిపై శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లకు చెందిన ఇంజినీరింగ్ అధికారులు, కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, హమీద్ పటేల్, ఉప్పల పాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డి, సింధుఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబాలతో కలిసి ఎమ్మెల్యే గాంధీ శుక్రవారం మియాపూర్ క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెండింగ్ పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. తమ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు, వాటన్నింటినీ దశలవారీగా పురోగతిలోకి తీసుకురావాలన్నారు. రహదారుల విస్తరణ, నాలాల విస్తరణ, పార్కుల సుందరీకరణ, డ్రైనేజీల నిర్మాణాలు సహా ఇతర మౌలిక వసతుల కల్పనను పూర్తి చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు తగు పర్యవేక్షణ చేపట్టి సకాలంలో పనులు ముగించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, ఈఈలు శ్రీనివాస్, శ్రీకాంతిని, డీఈలు రమేశ్, దుర్గాప్రసాద్, శిరీష, విశాలాక్షి, ఏఈలు రమేశ్, సునీల్, జగదీశ్, ప్రశాంత్, ప్రతాప్, సంతోష్‌రెడ్డి, పార్టీ నేతలు రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్‌లో రూ.90 లక్షలతో నాలాపై నిర్మిస్తున్న కల్వర్టు పనులను కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్వర్టు నిర్మాణంతో పలు ప్రాంతాలకు రాకపోకలకు ఎంతో వెసులుబాటు కలుగుతుందన్నారు. ఏండ్ల తరబడి నెలకొన్న సమస్యకు తాము శాశ్వత పరిష్కారం చూపినట్లు ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఆశా, గురువారెడ్డి, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటా

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

జీడిమెట్ల డివిజన్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు మంగళహారతులు పట్టి స్వాగతం తెలుపుతున్న ఓ మహిళ

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 2 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు తాను ఇచ్చిన మాట మీద కట్టుబడి ఉండి, ప్రభుత్వంతో కొట్లాడైనా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హామీ ఇచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం వ్యాప్తంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చేపట్టిన 'కృతజ్ఞత యాత్ర' 19వ రోజు శుక్రవారం జీడిమెట్ల డివిజన్ పరిధిలో న్యూవివేకానంద్‌నగర్, ప్రసూననగర్, శ్రీనివాస్‌నగర్‌ఫేస్-1, 2, 3, 4లలో కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు, మహిళలు పువ్వులు చల్లి మంగళహారతులతో స్వాగతం పలికి పూలేబొకేలు, శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ ఆయా సంక్షేమ సంఘాల కాలనీవాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గడిచిన రెండు పర్యాయాల కాలంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్న ఘనత మనకే దక్కిందని, అదే తీర్పుతో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు తాను ఇచ్చిన మాటకు కట్టుబడి ఎంత వరకైనా, ఎక్కడి వరకైనా వెళ్లి నియోజకవర్గానికి కావాల్సిన నిధులను తెచ్చి అభివృద్ధికి ఆటంకం లేకుండా పనులను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు శుక్రవారం జీడిమెట్ల దండముడిలోని ఎమ్మెల్యే వివేకానంద్‌ను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రాలు అందించారు. సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లైన్‌లో మాట్లాడి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు చోటుచేసుకోకుండా వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఐటీ కారిడార్‌లో డ్రగ్స్ పట్టివేత

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 2: డ్రగ్స్ విక్రయిస్తున్న మహిళతో పాటు మరో యువకుడిని గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి కొకైన్, ఎండీఎంఏ డ్రగ్స్‌ను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గచ్చిబౌలి ఐటీ కారిడార్ పరిధిలో నిషేధిత డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఓ మహిళతోపాటు ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి 10 గ్రాముల కొకైన్, 10 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూర్ నుంచి ఈడ్రగ్స్‌ను తెప్పించి నగరంలో విక్రయిస్తున్నట్లు సమాచారం. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు శనివారం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

గంజాయి స్వాధీనం

అంజయ్యనగర్ హాస్టల్‌లో నివాసం ఉంటున్న యు.నవీన్(28) జొమాటో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. గంజాయిని విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు ఎస్వోటీ పోలీసులు నవీన్‌ను అదుపులోకి తీసుకొన్నారు. అతడి నుంచి 1.8కిలోల గంజాయిని గుర్తించి నిందితుడిని రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

మియాపూర్, ఫిబ్రవరి 2 : అక్రమ నిర్మాణాలపై హెచ్ఎండీఏ కొరడా ఝుళిపించింది. శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ ఎంఏ.నగర్‌లో సర్వే నంబర్ 100, 101లో పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. కొందరు రాజకీయ నేతలు వీటి పేరుతో పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈనేపథ్యంలో హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు పోలీసు సిబ్బంది సాయంతో ఎంఏనగర్‌లో జేసీబీ వాహనాలతో నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా కూల్చివేతలను అడ్డుకునేందుకు స్థానికులు యత్నించటంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. ఫిర్యాదులు అందడంతో వాటిని కూల్చేసినట్లు హెచ్ఎండీఏ అసిస్టెంట్ ఎస్టేట్ అధికారి గౌతం తెలిపారు. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేదిలేదని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్ నుంచి పీజేఆర్‌నగర్ వరకు రూ.55లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యతతో సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నిర్మాణం సందర్భంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ తెలిపారు.

అంజయ్యనగర్ అభివృద్ధికి కృషి

బాలానగర్, ఫిబ్రవరి 2 : అంజయ్యనగర్ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. శుక్రవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని హస్మత్‌పేట అంజయ్యనగర్‌లోని హనుమాన్ దేవాలయంలో ఏర్పాటు చేసిన బోర్ పంప్‌ను ఆయన ప్రారంభించారు. హనుమాన్ ఆలయ చైర్మన్ మక్కల బలరాం, నేతలు కనకరాజు, బాలరాజు, గడ్డం నర్సింగ్ రావు, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, రాములు, అశోక్, మల్లేశ్, యాదగిరి పాల్గొన్నారు.

PASSPORT LOST

I. K. Vijayakumar, S/o. K.V. Krishnamurthy, Plot No. 1598.1601.FT3 Sri Sai Ambika Residency Pragathi nagar, Nizampet, Medchal -90. T.S. I Lost My Original Passport (No. MASW02319600) During Shifting My Residence From Suchitra to Prasanthnagar Area. If anybody Notice/ Found Pls Call: 8106926080

PUBLIC NOTICE

The General public at large are hereby informed that my client **DAMERA VAMSHI MOHAN, S/O.LATE D.RAMA MURTHY, R/o. 272, Laning Street Southington CT, USA -06489 represented by his SPA Holder MR.SHAIK ABDUL SAMAD, S/O.SHIK ABDUL KHADAR, R/o. H.No.12-12-1/A, Hyderabad, Telangana State - 500061,** have lost their original Documents Pertaining to Property bearing **Flat No.213, (in Second Floor), House No.6-8/2/213/A/1(PTIN NO.1266126229) of "HI - RISE PARADISE"** with built up area of 1324.0 Sq.Feet, (including common area) and 100.0 Sq. Feet Car Parking in the Cellar, along with an Undivided share of land admeasuring 46.0 Sq. Yards., (Out of total land admeasuring 3658.0 Sq.Yards), on Plot Nos 4,5,6,7,8,9,10,11,12 & 13, in Survey Nos 13/A, 14/A & 33, situated at Bachupally Village, (Previously Bachupally Grampanchayath), Nizampet Municipal Corporation, Bachupally Mandal, Medchal-Malkajgiri District, and hereby Notify to the general public and claimants that the Original Sale Deed Doc.No.568/2007, Dated 16.10.2007, for the scheduled Property has misplaced/lost and it is not traceable.

In case, any person/claimants have come into possession of the same may be restored to us within 7 days, failing which it will be presumed that the property is free from encumbrances and it is deemed that no person has any claim, interest or demand in the said Property.

G.Murali Mohan & Ch.Venkat Advocates
Flat No.G-6, Vivekananda Towers Vivekananda Nagar, Kukatpalli, Hyd. 7993031568 & 9390313865
Date: 02.02.2024

బీఆర్ఎస్ సమావేశాన్ని విజయవంతం చేద్దాం

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం వ్యాప్తంగా బీఆర్ఎస్ సన్నాహక సమావేశాలు

నిజాంపేట్ కార్పొరేషన్ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలతో సమావేశమైన మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి తదితరులు

దుండిగల్, ఫిబ్రవరి 2 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం గార్డెన్స్‌లో శనివారం జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంటరీ స్థానం, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేద్దామని పార్టీ నేతలు, శ్రేణులు నిర్ణయించారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఉమ్మడి రంగారెడ్డి ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజు ఆదేశానుసారం శుక్రవారం నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్ మున్సిపాలిటీ కార్యకర్తల సమావేశాలు జరిగాయి. నిజాంపేట్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి అధ్యక్షతన తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజు, నిజాంపేట్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్, సీనియర్ నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డితో పాటు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

❖ దుండిగల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం గండిమైసమ్మలోని జిల్లా తెలంగాణ భవన్‌లో జరిగింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. శనివారం కేటీఆర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి పెద్దసంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

❖ జీహెచ్ఎంసీ పరిధి కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని ఆయా డివిజన్లల్లోనూ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా శనివారం మధ్యాహ్నం 1 గంటలకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం గార్డెన్స్‌లో జరిగే కార్యకర్తల సమావేశంలో పాల్గొననున్నందున బీఆర్ఎస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నేతలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఆకట్టుకుంటున్న డిజైర్ డిజైనర్ ఎక్స్‌పో

వస్త్రాలు, ఆభరణాలు, గృహోపకరణ ఉత్పత్తులు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని ఎన్‌కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన డిజైర్ డిజైన్ ఎక్స్‌పో కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ మోడల్స్ ఇషికా, కుసుంలతోపాటు నిర్వాహకురాలు అనితా అగర్వాల్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ఈనెల 4వ తేదీ వరకు కొనసాగనున్నదని, దేశ నలుమూలల నుంచి ప్రముఖ డిజైనర్‌ల చేతుల మీదుగా రూపొందించబడిన వస్త్రాలు, ఆభరణాలు, గృహోపకరణ ఉత్పత్తులు ప్రదర్శనలో కొలువుదీరాయి. అనంతరం మోడల్స్ నిర్వాహకురాలుతో కలిసి సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. *– మాదాపూర్, ఫిబ్రవరి 2*

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 2:మహదేవపురం సమీపం సిక్కుబస్తీకి చెందిన విక్రమ్‌సింగ్ (22)కార్మికుడు. ఎల్లమ్మబండ నుంచి శుక్రవారం సాయంత్రం బైక్‌పై వస్తున్నాడు. కాసేపటికి ఇంటికి చేరుకుంటాడనగా సిక్కుబస్తీవద్ద వెనుక నుంచి టిప్పర్ వాహనం ఢీకొట్టిం ది. దీంతో విక్రమ్‌సింగ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని కూకట్‌పల్లి రామ్‌దేవ్ రావు ఆసుపత్రికి తరలించగా..చికిత్స పొందుతూ మృతి చెందాడు. జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జాతీయస్థాయి సెమీఫైనల్ కబడ్డీ పోటీలు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కార్పొరేటర్ కాసాని శిరిషాబీరేశ్ ముదిరాజు

దుండిగల్, ఫిబ్రవరి 2 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీలో జరుగుతున్న కాసాని కౌసల్య ముదిరాజు మెమోరియల్ 49వ జాతీయస్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్-2024 పోటీలు శుక్రవారం రెండవరోజు కొనసాగాయి.వివిధ రాష్ట్రాలకు చెందిన 39 బాలికలు, 9 బాలుర జట్లు పాల్గొంటుండగా..శుక్రవారం లీగ్‌పోటీలు జరిగాయి. శనివారం క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్, ఆదివారం ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అంతర్జాతీయ కబడ్డీ అసోసియేషన్ డైరెక్టర్, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కాసాని జ్ఞానేశ్వర్,అమెచ్యూర్ కబడ్డీ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు కాసాని వీరేశ్, పద్మశ్రీ అజయ్‌ఠాకూర్, అర్జున అవార్డు గ్రహీత అనూప్‌కుమార్, కార్పొరేటర్లు కాసాని సుధాకర్, కాసాని శిరీష పాల్గొన్నారు.

యశస్వినిని అభినందిస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి

విద్యార్థికి అభినందనలు

దుండిగల్, ఫిబ్రవరి 2: జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ద్వారా రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికై ఇటీవల ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో హైదరాబాద్ కంటింజెంట్ తరపున పాల్గొన్న దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(ఎంఎల్ఆర్ఐటీ) కళాశాల విద్యార్థి, ఎన్ఎస్ఎస్ వలంటీర్ గుగ్లావత్ యశస్వినిని శుక్రవారం కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అభినందించారు. ఆమెను అభినందించినవారిలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కే.శ్రీనివాసరావు, డీన్ డా.రాధికాదేవి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి బలరాం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాయిని ఉదయ రంజన్‌గౌడ్ ఉన్నారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థి రిపబ్లిక్ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనడం అభినందనీయమని మల్కాజిగిరి ఎమ్మెల్యే, ఎంఎల్ఆర్ఐటీ కళాశాల సెక్రెటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి యశస్వినిని ఫోన్ ద్వారా అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య

దుండిగల్, ఫిబ్రవరి 2 : కుత్బుల్లాపూర్ సర్కిల్, సుభాశ్ నగర్ డివిజన్ పరిధి, సూరారం కాలనీ ముత్యాలబస్తీకి చెందిన మురిగి ప్రసన్న(25)కు వెంకట్ అనే వ్యక్తితో ఏడేండ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం వీరు హమీద్‌బస్తీలో నివాసం ఉంటున్నారు. ప్రసన్న స్థ